క్లుప్తంగా

ఘనంగా లూథరన్ చర్చి గోల్డెన్ జూబ్లీ వేడుకలు


షీలానగర్‌లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చి వేడుకల్లో ఏసు ప్రేమికులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చి 50వ సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం చర్చిలో సంఘం సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి అధ్యక్షుడు కుడారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ సభ్యుల సహకారంతో పలు సేవాకార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి గొర్లె రవిబాబు, కోశాధికారి బొడ్డు వినయ్ కుమార్, సురేన్, సంఘం డీకాన్, సొసైటీ, స్త్రీ సమాజం, యవ్వన సమాజం, సండే స్కూల్ సమక్షంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అబాకస్‌తో విద్యార్థుల ఆలోచనకు పదును

స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: అబాకస్ పోటీల వల్ల విద్యార్థుల ఆలోచనకు పదును పెడతారని తద్వారా వారిలో సృజనాత్మకత మరింత మెరుగవుతుందని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)యు. శ్రీధర్ అన్నారు. మ్యాథ్స్ టు మెరిట్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీ పరీక్షలకు వివిధ రాష్ట్రాల నుంచి ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయసు కలిగిన సుమారు 450 విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఈపూరి సుధారాణి మాట్లాడుతూ ఏడాదికోసారి చొప్పున 15 ఏళ్ల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అబాకస్ వల్ల జ్ఞాపకశక్తితో పాటు మనసులో లెక్కలు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈపూరి బుచ్చిరాజు, యోగేష్‌కుమార్ గార్గ్, ఆకుండి రవిశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

గాజువాక: తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై, స్టీల్ ప్లాంట్ యాజమాన్యం తీరుపై ధ్వజమెత్తారు. కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించవద్దని, పనులు కోల్పోయిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిట్‌నెస్ పేరుతో చేపడుతున్న వైద్య పరీక్షలను వెంటనే నిలిపివేయాలని, ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.రామారావు, యు.రామస్వామి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఝరి.. నాగదేవత గుడి


శివపార్వతుల విగ్రహాలు

- సకల దేవతామూర్తులకు నిలయం
- జిల్లా నలుమూలల నుంచి భక్తుల తాకిడి

ఆ ఆలయం ఆధ్యాత్మిక ఝరిగా విరాజిల్లుతోంది. సకల దేవతామూర్తులు కొలువై ఉండడంతో నిత్యం భక్తులతో కిటకిటలాడుతోంది. కార్తీక మాసం ఆరంభం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరగనుంది. నాగుల చవితి, కార్తీక పౌర్ణమి, నాగ పంచమి వంటి ప్రత్యేక రోజుల్లో ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలివస్తారంటే అతిశయోక్తి కాదు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.


నాగుల చవితిరోజు అమ్మవారిని దర్శించుకోడానికి వచ్చిన అశేష భక్తజనం(ఫైల్)


కొండపై నాగుపాము రూపంలో అలంకరించిన పుట్టలో పాలుపోస్తున్న భక్తులు (ఫైల్)


నాగదేవత దర్శనానికి బారులు తీరిన భక్తులు (ఫైల్)

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారం ఎదురుగా ఉన్న కొండపై నాలుగు దశాబ్దాల కిందట నాగదేవత గుడిని నిర్మించారు. దీంతో ఈ కొండ నాగదేవత కొండగా పేరొందింది. దువ్వాడ సెక్టార్–1కి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారికి అనుసంధానంగా కొండ ఉండడంతో రెండు దశాబ్దాల నుంచి విశేష ప్రాచుర్యం పొందింది. దీంతో జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి నాగ దేవతకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. కార్తీక మాసం నెల రోజులు కొండపై విశేష పూజలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నారు.

దినదినాభివృద్ధి

15 ఏళ్ల కిందట ఆలయ కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. దాతలు స్వచ్ఛందంగా వచ్చి ఆలయ అభివృద్ధికి చేయూత నివ్వడంతో విశేష ప్రాచుర్యం పొందింది. వాస్తు ప్రకారం పలు దేవతా మూర్తుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

సకల దేవతలకు నిలయం

విఘ్నపతి, అభయాంజేయ స్వామి పార్వతీ పరమేశ్వర్లు, షిర్డీసాయి నాథుడు, సీతారాములు, కైలాస నాథుడు.. ఇలా అందరు దేవతామూర్తులను ప్రతిష్ఠింపజేశారు. కొండపై ఉన్న పుట్టలను రంగులతో అలంకరించారు. కైలాసనాథుడి చుట్టూ ఫౌంటైన్ ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో రంగు రంగుల విద్యుద్దీపాల వెలుగులో నీరు విరజిమ్మేలా ఏర్పాటు చేశారు. మెట్ల మార్గాన్ని రాతితో నిర్మించడంతో పాటు భక్తులకు ఇబ్బంది లేకుండా మెట్లకు రెయిలింగ్ ఏర్పాటు చేశారు.

నాగుల చవితి రోజు పరస

నాగుల చవితి రోజు సాయంత్రం కొండ దిగువన పరస (తీర్థ మహోత్సవం) అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆలయ కమిటీ ఏటా ఏదో ఒక కొత్త అభివృద్ధి కార్యక్రమం చేపడుతూ ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు

నాగుల చవితికి ముస్తాబు

మంగళవారం నాగుల చవితిని పురస్కరించుకొని నాగ దేవత ఆలయాన్ని అధునాత విద్యుద్దీపాలతో అలంకరించారు. రంగులు అద్దారు. నాలుగు నుంచి ఐదు వేల మంది వరకు భక్తులు దర్శించుకోనున్నారు. దీంతో కొండపై నున్న పుట్టల్లో పాలు పోయడానికి వీలుగా ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ఆలయ కమిటీ సారథ్యంలో తీర్థ ప్రసాదాలు అందించనున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మంచినీరు, మరుగుదొడ్ల వసతి కల్పించారు.

స్వాములకు నిత్య అన్న సమారాధన ప్రారంభం


షీలానగర్ అయ్యప్ప ఆలయంలో స్వాములకు భోజనం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో నిత్య అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి ప్రారంభించారు. తొలుత ఆలయంలో అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు అదపాక వెంకటరమణ మాట్లాడుతూ ఈ రోజు నుంచి డిసెంబర్ 27వరకు నిత్య అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. 22 సంవత్సరాల నుంచి దాతల సహకారంతో నిర్విఘ్నంగా మండలకాలంలో నిత్య అన్నసమారాధన చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మొదటి రోజు దాతలైన తిప్పల నితీష్ రెడ్డి, సతీష్ రెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, ధర్మాల శ్రీనివాసరెడ్డి, జీలకర్ర నాగేంద్ర, గొందేశి మహేష్ రెడ్డి, తిప్పల అప్పల స్వామి, పాలమరశెట్టి బూలిరాజు, ఎస్.ఏ.నాయుడు, శేషగిరిరావు, నాగుల రవికుమార్, సీహెచ్.మురళీశ్వరరావు, మూరాల అప్పల నాయుడు, మెట్టా వేణుగోపాలరావు, సీహెచ్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెదగంట్యాడ: బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని న్యూపోర్టు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భానోజీతోట శివారు ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్యామ్ సిబ్బందితో కలసి దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పెరిగే ధరలకు హద్దు లేదా?


నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కునగరం: రోజు రోజుకూ పెరిగే ధరలకు హద్దు లేదు. ఏలే వారికి సిగ్గు లేదని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి బూసి పరమేశ్వరి అన్నారు. నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉక్కునగరం రైతు బజారులో నిరసన చేపట్టారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లిపాయలతో వందల లారీలు బారలు తీరాయని.. కిలో రూ. 5 కొనడానికి హోల్‌సేల్ వ్యాపారులు ముందుకు రావడం లేదన్నారు. రిటైల్ మార్కెట్‌లో ఉల్లి కేజీ రూ. 50, కందిపప్పు రూ. 200, బియ్యం రూ. 60, నూనె రూ. 120, చింతపండు రూ. 70 ఉండగా కిలో రూ. 80కు తక్కువకు ఏ కూరగాయ దొరకడం లేదన్నారు. వెంటనే ధరలు అదుపు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ డిపోల ద్వారా నిత్యావసరాలు సరఫరా చేయాలని ఇందు కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వమే రైతుల నుంచి పంటలు కొని రేషన్ డిపోల ద్వారా అమ్మితే రైతు కూడా అన్నం తింటాడన్నారు. కార్యక్రమలో కె. తులసి, కె. లక్ష్మి, రమణమ్మ, కె. రమ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

సీపీఎం నేత సీహెచ్ నర్సింగరావు


మహాసభలో ప్రసంగిస్తున్న నర్సింగరావు

గాజువాక: మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం సీనియర్ నేత సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ గాజువాక జోన్ 9వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాల కారణంగా జరుగుతున్న నష్టాలను ప్రజలవద్దకు తీసుకెళ్లాలన్నారు. మతోన్మాదాన్ని ఓడించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. విశాఖస్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కావడం వల్లే గాజువాక అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించిందన్నారు. ఈ ప్రాంతం ఒకప్పుడు అభివృద్ధికి దూరంగా ఉండేదని, పారిశ్రామికీకరణ తర్వాత ఇక్కడ పెద్దపెద్ద షాపింగ్ మాళ్లు వచ్చాయన్నారు. ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు పూనుకుందన్నారు. ప్రభుత్వరంగం బలోపేతం అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఈ ప్రాంత ప్రజలకు ఆధారమన్నారు. ఈ పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే ఉంటేనే స్టీల్ ధరలు కూడా తక్కువకు లభిస్తాయని, లేనిపక్షంలో దారుణంగా పెరిగిపోతాయని అన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతోపాటు ధరల నియంత్రణ కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీలేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక జోన్ కార్యదర్శిగా రాంబాబు

సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శిగా ఆ పార్టీ నాయకుడు ఎం.రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మూడేళ్లపాటు ఆ బాధ్యతలో కొనసాగుతారు. కాగా కమిటీ సభ్యులుగా మరో 13 మందిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎ.లోకేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం: తమకు న్యాయం చేయాలని కోరుతూ 28 మంది కాంట్రాక్టు కార్మికులు ఆదివారం విశాఖ డెయిరీ ఎదుట నిరసన చేపట్టారు. విశాఖ కో ఆపరేటివ్ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోకా సోముడు, వరదాడ వెంకటరమణ మాట్లాడుతూ 2005 నుంచి తమను పర్మినెంట్ చేయకుండా అన్యాయం చేసిందన్నారు.

గోతులు పూడ్చుతున్నారు


షీలానగర్‌లో రోడ్డు మరమ్మతులు చేపడుతున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అక్కిరెడ్డిపాలెం: ప్రమాదకరంగా తయారైన షీలానగర్ రోడ్డులో గుంతలను జీవీఎంసీ అధికారులు పూడ్చుతున్నారు. గుంతల రోడ్డు వల్ల వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురితమైన అమ్మో షీలానగర్ రోడ్డు కథనానికి గాజువాక జోన్ జీవీఎంసీ అధికారులు స్పందించారు. ప్రమాదకరమైన గోతులను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు పలువురు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

ఉక్కు ఉద్యోగిపై పోలీస్ కేసు

పెదగంట్యాడ: ఉక్కు ఉద్యోగిపై న్యూపోర్టు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడకు చెందిన గండేపల్లి పరదేశినాయుడు అనే వ్యక్తి నెల్లిముక్కుకుచెందిన ఎల్లేటి పెంటమ్మకు చెందిన ఆర్ కార్డును తనపై బదిలీ చేయించుకుని స్టీల్‌ప్లాంట్ అధికారులను మోసం చేసి స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం సంపాదించాడని ఎల్లేటి సీత, నరసాయమ్మ, ఎల్లేటి దేముళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. బాధితులు మాట్లాడుతూ తమ కుటుంబ పెద్ద అయిన పెంటమ్మకు స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల కింద ఆర్ కార్డు 229ను స్టీల్‌ప్లాంట్ అధికారులు కేటాయించారని వివరించారు. అయితే పరదేశినాయుడు తాను ఎల్లేటి పెంటమ్మ మనవడినని చెప్పుకుంటూ నకిలీ పత్రాలు సృష్టించి ఉక్కులో ఉద్యోగం చేస్తున్నాడని తెలిపారు. తమ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన అధికారులు పరదేశి నాయుడు మోసం చేసి ఆర్ కార్డును బదిలీ చేయించుకున్నాడని నిర్ధారించారన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

పార్కుల్లో ఆకతాయిల ఆగడాలు

విద్యుద్దీపాలు, ప్యానల్ బోర్డులు, విద్యుత్ వైర్లు ధ్వంసం


విద్యుత్ వైర్లు కట్‌చేసి ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసిన దృశ్యం


ఓపెన్‌జిమ్ వద్ద మద్యం సేవించి మందుసీసాలు పడేసిన మందుబాబులు




పార్కు నేమ్ బోర్డును ధ్వంసం చేసిన ఆకతాయిలు

అగనంపూడి: ఆకతాయిల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. రాత్రి వేళల్లో పది మంది వినియోగించే ప్రదేశాల్లో అల్లరి చేయొద్దని వారించినా, మద్యం సేవించరాదని చెప్పినా వారి చెవులకెక్కడం లేదు. బహిరంగ ప్రదేశాల్లో చాలా మంది యువత సిగరెట్లు తాగడం, మద్యం సేవించడం ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, ఓపెన్‌జిమ్‌ల్లో వీరి ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. రాత్రి ఏడు గంటలు దాటిన తర్వాత వీరిని అదుపు చేయడం కష్టంగా మారుతోంది. ఎవరైనా వీరి అల్లరి పనులను ప్రశ్నించినా వారిపై తిరగపడుతున్నారు. పార్కుల్లో వీధి దీపాలు పగలగొట్టడం, విద్యుత్ పరికరాలు ధ్వంసం చేస్తున్నారు. మద్యం సేవించి బాటిళ్లను నేలకేసి బాదుతూ పెంకులు చెల్లా చెదురుగా పడేస్తున్నారు. ఇదే కోవలో 87వ వార్డు వడ్లపూడి సమీపంలోని శివాజీనగర్ ఉద్యానవనంలో (జీవీఎంసీ పార్కు)లోని విద్యుత్ ప్యానల్ బోర్డును ధ్వంసం చేశారు. వైర్లు కట్ చేశారు. గేట్లు విరగ్గొట్టారు. నేమ్ బోర్డును ధ్వంసం చేశారు. మద్యం సేవించి ఓపెన్ జిమ్ వద్ద మందుబాటిళ్లు చెల్లా చెదురుగా పడేశారు.

నిర్వహణ లోపం వల్లే..

జీవీఎంసీ పార్కులు నిర్మిస్తున్నా వాటి ఆలనాపాలనా గాలికి వదిలేస్తుంది. కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌ల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఆకతాయిలు రాత్రి వేళ రెచ్చిపోతున్నారు. తమ అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మార్చుతున్నారు. దీంతో పార్కులు కొద్ది రోజులకే నిరుపయోగంగా మారుతున్నాయి. జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కుల వద్ద వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్మోతో బాలుడి ప్రాణాలు నిలిపిన వైద్యులు


ప్రాణాలు కాపాడిన బాబుతో కిమ్స్ ఐకాన్ వైద్యులు

అక్కిరెడ్డిపాలెం:విశాఖ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన రెండు నెలల బాబుకు అత్యంత అరుదైన గుండె వ్యాధి వచ్చింది. ఆ బాబును షీలానగర్‌లోకి కిమ్స్ అడల్స్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు వెంటనే బాబుకు ఎక్మో పెట్టి మూడు రోజుల తర్వాత సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి ఛీఫ్ నియోనాలజిస్ట్ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి, చీఫ్ ఇంటెన్సినిస్ట్ పీడియాట్రిక్ ఐసీయూ విభాగాధిపతి డాక్టర్ రౌతు సంతోష్ కుమార్ ఆదివారం వివరాలు వెల్లడించారు. సాధారణంగా ఊపిరితిత్తుల్లో శుద్ధి అయిన రక్తం రక్తనాళాల ద్వారా గుండెలోని ఎడమ కర్ణికకు వెళ్లి అక్కడ నుంచి శరీరం మొత్తం సరఫరా అవ్వాలి. కానీ బాబుకు కుడివైపు గుండె గదుల్లో వెళ్లిపోవడంతో శరీరానికి తగినంత రక్తం సరఫరా కావడం లేదని తెలిపారు. ఈ సమస్యను వైద్య పరిభాషలో టోటల్ అనామలస్ పల్మనరీ వీనస్ కనెక్షన్ (టీఏపీవీసీ) అంటారన్నారు. ఈ సమస్య ప్రతీ లక్ష మంది పిల్లల్లో 6 నుంచి 12 మందిలో పుట్టుకతోనే ఉంటుందన్నారు. ఆస్పత్రి వైద్య బృందం డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ సాయి మణినందన్, డాక్టర్ శాంతి ప్రియ బాబును ప్రత్యేకమైన సంరక్షణలో ఉంచి పూర్తిగా కోలుకున్న 25 రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారన్నారు.

పిక్నిక్‌ల సందడి షురూ

గాజువాక/పెదగంట్యాడ: కార్తీక మాస వనభోజనాల సందడి మొదలైంది. కార్తీక మాసం ప్రారంభమైన మరుసటి రోజే ఆర్యవైశ్య వెల్ఫేర్ కమిటీ (ఏడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తొలి పిక్నిక్ నిర్వహించింది. పవిత్ర కార్తీక మాసంలో ఆధ్యాత్మికతతోపాటు వన భోజనాలకు ప్రాచుర్యం ఉన్న విషయం తెలిసిందే. కార్తీక మాసంలో ప్రతిరోజు శివ పూజలు నిర్వహించడంతో పాటు సమూహాలు, సంఘాలు, మిత్ర బృందాలు పిక్నిక్‌లతో సందడి చేస్తాయి. ఈ నేపథ్యంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి సుమారు నెలా పదిహేను రోజుల పాటు ప్రతి ఆదివారం వనభోజనాల సందడి ఉంటుంది. ఈ సందర్భంగా ఆత్మీయులను, స్నేహితులను, సన్నిహితులను కలుసుకోవడానికి పిక్నిక్‌లు కేరాఫ్‌గా మారుతాయి. ప్రతి ఏటా సంక్రాంతికి కలుసుకొనే కుటుంబ సభ్యులతో గడిపే జనం కార్తీక మాసం వస్తే వనభోజనలతో సందడి చేస్తారు. అందువల్లే కార్తీక మాసం పూజలకే కాకుండా ఆత్మీయ కలయికకు వేదికగా మారుతుంది. ఉక్కునగరంలోని నెహ్రూ పార్కు సహా వివిధ పార్కులు, యారాడ బీచ్, అప్పికొండ బీచ్, తిక్కవానిపాలెం బీచ్ తదితర స్థలాలు పిక్నిక్‌లకు వేదికగా మారుతాయి.

ఏడబ్ల్యూసీ ఆధ్వర్యంలో ఘనంగా వనభోజనాలు


వినోదాత్మకంగా గడుపుతున్న ఆర్యవైశ్య సభ్యులు


ఆట, పాటలతో మహిళల సందడి

– అప్పికొండ బీచ్‌వద్ద ఆర్యవైశ్య వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల్లో ఆర్యవైశ్య వెల్ఫేర్ కమిటీ, వాసవీ క్లబ్‌ల నాయకులు, ప్రముఖులు కులుకూరి మంగరాజు, కె.శ్రీను రమేష్, నంబూరు జగన్నాథం, కొల్లా గుప్త, బొడ్డు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.